కథ

# ఒకరికి ఒకరు

సింగీతం ఘటికాచల రావు
95004 31474

సాయంత్రం కాలేజీ నుంచి తొందరగానే వచ్చేసింది శ్రీవల్లి. చాలా సంతోషంగా ఉన్నది. అందుకు కారణం.. ఆరోజు కాలేజీలో ప్లేస్‌మెంట్ కోసం ఇంటర్వ్యూలు జరిగాయి. పేరుమోసిన పెద్దపెద్ద కంపెనీల ప్రతినిధులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐటీకి డిమాండ్ తగ్గిందన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో.. అలాంటిదేమీ లేదన్నట్టుగా కంపెనీలు పోటీపడి అభ్యర్థులను ఐటీ రంగంనుంచే ఎంపిక చేసుకున్నాయి.

ఇంజినీరింగ్ (సీఎస్ఈ) చివరి సంవత్సరం చదువుతున్న శ్రీవల్లి.. క్లాసు మొత్తంలో చురుకుగా ఉంటుంది. అందువల్ల ఆమె ఎంపిక ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు గానీ, ప్యాకేజీ మాత్రం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. సాధారణంగా అందరికీ మూడు నుంచి నాలుగు లక్షల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేస్తారు. శ్రీవల్లికి మాత్రం ఏకంగా ఎనిమిది లక్షలు ఆఫర్ చేశారు.

పరీక్షలన్నీ ముగిశాక కాలేజీ చివరి రోజున ఫేర్‌వెల్ డే నిర్వహించినప్పుడు కాలేజీ ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

''మై డియర్ స్టూడెంట్స్.. జీవితంలో ముఖ్యమైన ఘట్టం ముగిసింది. లాక్‌డౌన్ తర్వాత బైటికి వెళ్తున్న మొదటి బ్యాచ్ మీరే. అయినా గానీ ఈసారి క్యాంపస్ ఇంటర్వ్యూలలో అనుకున్నదానికన్నా ఎక్కువమంది విజయం సాధించి, జీవితానికి కావాల్సిన పునాదిని వేసుకున్నారు. అయితే, నేనొక్కటే చెప్పదల్చుకున్నాను. మీరు ఏ పనిచేసినా నిబద్ధతతో చెయ్యండి. అది మిమ్మల్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుంది. మీ నిబద్ధతే మీకు శ్రీరామరక్ష. అది మీ జీవితాలకు బంగారుబాట వేస్తుంది. మరో ముఖ్యమైన విషయం.. మీరు ఉద్యోగానికి ఎంత ప్రాముఖ్యం ఇస్తారో అంతే ప్రాముఖ్యాన్ని కుటుంబానికి కూడా ఇవ్వాలి. దీన్నే వర్క్-లైఫ్ బ్యాలెన్స్ అంటారు. మీరు సంపాదించేది మీ కుటుంబం కోసమేనన్న విషయం మర్చిపోవద్దు. కాబట్టి, కేవలం సంపాదించే యంత్రాలుగా మిగిలిపోవద్దు. జీవితాన్ని ఆస్వాదించేందుకు అన్ని విధాలా ప్రయత్నించండి. మీకంటూ కొంత సమయాన్ని కేటాయించుకుని ఆ సమయంలో కేవలం మీ గురించి, మీ కుటుంబం గురించి మాత్రమే ఆలోచించుకోండి. ఇంట్లో ప్రశాంతత ఉంటే పనిలో ఏకాగ్రత పెరుగుతుంది. దాంతో నిబద్ధత కూడా పెరుగుతుంది. కంపెనీకి విశ్వాసపాత్రులుగా, ఫ్యామిలీకి విధేయులుగా ఉండండి. ఆల్ ద బెస్ట్!'' అంటూ ముగించాడు.

* * *

శ్రీవల్లి తల్లిదండ్రుల సంతోషానికి హద్దుల్లేవు. క్యాంపస్ ఇంటర్వ్యూలో శ్రీవల్లికి మాత్రమే అంతటి ప్యాకేజ్ లభించింది.

''అమ్మాయ్! నీకు మరో ముఖ్యమైన విషయం కూడా చెప్పాలి. రేపే నిన్ను చూడ్డానికి పెళ్లివాళ్లొస్తున్నారు. భగవంతుడి దయవల్ల ఈ పెళ్లి కుదిరితే ఇంతకన్నా మరేమీ కోరను'' అన్నాడు తండ్రి చక్రవర్తి.

''అదేంటి నాన్నా.. ఇప్పుడే కాలేజీ ముగిసింది. ఉద్యోగంలో కూడా చేరబోతున్నాను. ఇంత త్వరగా పెళ్లా?'' అన్నది కొంచెం అసహనంగా శ్రీవల్లి.

''ఇవి కేవలం పెళ్లి చూపులేనమ్మా. పెళ్లంటే ఎలాగూ కనీసం మరో ఆర్నెల్లు.. ఏడాదైనా పడుతుందిలే! నువ్వు హాయిగా ఉద్యోగం చేసుకో. తరువాతి సంగతి ఆలోచిద్దాం'' అన్నాడు తండ్రి.

అయిష్టంగానే మౌనం వహించింది శ్రీవల్లి.

మర్నాడు సాయంత్రం పెళ్లిచూపులు జరిగాయి. అబ్బాయి శ్రీధర్ కూడా ఐటీ రంగంలోనే పనిచేస్తున్నాడు. జాయినై నాలుగేళ్లయింది. అంటే ప్రస్తుతం అతనికి పాతికేళ్లు. ఏడాదికి పదిలక్షల జీతం. కంపెనీ కూడా పెద్దదే! అన్నీ ఓకే అయితే.. ముహూర్తాలు పెట్టుకోవచ్చన్న నిర్ణయం తీసుకున్నారు.

''నాన్నా.. నేనొక ఆరు నెలలపాటు ఉద్యోగం చేస్తాను. ఆ తరువాతే ముహూర్తాలు పెట్టుకుందాం'' అన్నది శ్రీవల్లి.

''నాకేం అభ్యంతరం లేదు'' అన్నాడు శ్రీధర్.

అతని తల్లిదండ్రులు కూడా సరేనన్నారు.

మరో నాలుగు నెలల తరువాత ఆఫర్ లెటర్‌తో పాటు ఉద్యోగంలో చేరాల్సిన తేదీ కూడా పంపించారు కంపెనీవాళ్లు. శ్రీవల్లి సంతోషానికి అవధుల్లేవు. తన చిన్నతనంలో సంపాదన లేక తండ్రిపడ్డ కష్టాలు తనకింకా గుర్తే. చిన్నతనంలో బడికి ఫీజులు కూడా కట్టలేని పరిస్థితిని చూసింది శ్రీవల్లి. ఆ పరిస్థితులన్నీ ఎదుర్కొని ఎన్నో కష్టాలకోర్చి తనను ఈ స్థితికి తీసుకొచ్చిన తండ్రి త్యాగం వెలకట్టలేనిది. ఆ రుణం తీర్చుకోలేనిది. అందువల్ల కనీసం ఈ ఆరు నెలలైనా తన సంపాదన మొత్తం తండ్రికే అంకితమివ్వాలన్న నిర్ణయానికి వచ్చింది శ్రీవల్లి.

